క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రతి అమ్మవాస్య రోజున భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యశ్వంత్‌రావు, జయగణేష్, బాలాజీరావు, రాజశేఖర్, డాక్టర్ కపానిధి, లోకేష్యదవ్, అరుణ్, శివప్రసాద్, దినకర్, రామారెడ్డి, గోపి, సత్యనారాయణ రావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నవధ్యానాలు పంపిణీ

తొట్టంబేడు: మండలంలోని ఇలగనూరు పంచాయతీ సచివాలయంలో శనివారం రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలగలు, నవధాన్యాలు అందజేశారు. టీడీపీ నాయకుడు గాలి మురళీ నాయుడు మాట్లాడుతూ రైతులు జీలుగలు, నవధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. దీని వల్ల భూమి సారవంతమవుతుందనానరు. ప్రస్తుతం ఎరువులు, యూరియా కొరత ఉన్నందున ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇలగనూరు మాజీ సర్పంచ్ మధు నాయుడు, వ్యవసాయ సహాయ అధికారులు పవన్, వినయ్‌తుల్లా, రైతులు నాగూరు, కుమారస్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



బుచ్చినాయుడుకండ్రిగలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో ఆమె వైద్యసిబ్బందితో కలసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, పర్యావరణం నాశనం అవుతుందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, సీహెచ్‌ఓ వెంకటేశులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లిలో శనివారం శ్రీకాళహస్తికి చెందిన శుక బ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న భక్త కన్నప్ప కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. పలువురు విద్యార్థులు, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టు కోఆర్డినేటర్ దొరకుమార్, వైద్యులు జయచంద్రప్ప, నరుసలు భవానీ, నందిని, ప్రధానోధ్యాయులు భారతి తదితరులు పాల్గొనానరు.

సెప్టెంబర్ 5 లోపు అభ్యంతరాలు తెలపాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో టిడ్కో ఇళ్ల కేటాయించిన 175 మంది లబ్ధిదారులకు నోటీసులు అందజేసినట్లు కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పురపాలక సంఘం పరిధిలో 4,064 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు 175 మంది నిరాకరించారని తెలిపారు. వారు ప్రభుత్వానికి సొంతంగా చెల్లించాలని నోటీసులు అందజేశామన్నారు. అందులో 110 మంది నోటీసులు స్వీకరించకపోవడం, వివరణ ఇవ్వకపోవడం, ఆసక్తి లేకపోవడం వంటి కారణాలు ఉన్నాయని తెలిపారు. జీవో నంబర్ 39ను అనుసరించి వారికి ఆ ప్లాట్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. సంబంధిత వివరాలను ఆయా సచివాలయాల్లోని నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు తెలిపారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబరు 5వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని వెల్లడించారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వున్న శ్రీకృష్ణ భజన మందిరంలో 8 రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు శనివారం రాత్రి ఆలయ నిర్వాహకులు ఇందుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధుల భజనలు, చిన్నారుల కోలాటాలు, నృత్యాలు, మంగళ వాయిద్యాల మధ్య రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడిని ఊరేగించారు.



కోలాటాలు చేస్తున్న చిన్నారులు

దుస్థితిలో మాదనపాళెం రోడ్డు

- అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



మడుగును తలపిస్తున్న మాదనపాళెం రోడ్డు

వరదయ్యపాళెం: సత్యవేడు మండలంలోని మాదనపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు మడుగును తలపిస్తోంది. ఇంతటి అధ్వానపు రోడ్డులో మా ఊరికి ప్రయాణం ఎలా సాగించేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాళ్లకుప్పం నుంచి మాదనపాళెం గ్రామం వరకు 1.8 కి.మీ. మేరకు గతంలో పంచాయతీరాజ్ గ్రావెల్ రోడ్డు ఉండేది. అయితే ఈ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేసేందుకు ఈఏపీ ద్వారా గత ప్రభుత్వం రూ.1.35 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే ఈ రోడ్డు 925 మీటర్ల మేరకు నిర్మాణం పూర్తయింది. మిగిలిన 925 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఆ గుంతల్లో నీటి నిల్వలు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా కార్లు, ద్విచక్ర వాహనాలు ఆ గుంతల్లో దిగి ఇరుక్కుపోతున్నాయి. నిధులు రాని కారణంగా నిర్మాణాలను పూర్తి చేయలేకపోయామని గుత్తేదారు చెబుతున్నారు. ఈ గ్రామం శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలోకి వస్తుంది. ఈ గ్రామానికి సమీపంలో పెప్సికో, బాల్ బేవరేజెస్ వంటి కీలక పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో అటువైపుగా వెళ్లాల్సిన ఉద్యోగులు, కార్మికులు వందలాది మంది ద్విచక్ర వాహనాల మీద, ఇతర వాహనాలపై వెళ్తుంటారు. వీరంతా వర్షం పడితే ఆ మార్గంలో వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోని అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని అటు గ్రామస్తులు, ఇటు పరిశ్రమల కార్మికులు కోరుతున్నారు.

రక్తదాతలే ప్రాణ దాతలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ

రేణిగుంట: రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. రేణిగుంట బస్టాండ్ కూడలిలో శనివారం శ్రీ నమో వెంకటేశ్వర ఆటో ఓనర్స్, శ్రీనివాస ఆటో ఓనర్స్ సంయుక్తంగా మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వీఆర్ రావణ మిత్ర బందం ఆధ్వర్యంలోపదేళ్లుగా మెగా రక్తదానం, వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అత్యవసర సమయంలో రక్తం కోసం ఎంతోమంది ఇబ్బందులు పడుతుంటారని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చని, దీనిపై అపోహలు వీడాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, వీఆర్ రావణ, ఆనంద్, సదాశివ రెడ్డి, ఆకుల సూరి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న శోభన్ యాదవ్

వరదయ్యపాళెం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా ప్రజాక్షేత్రంలోకి రావాలని, అందుకు బెయిల్ రావాలని మండలంలోని పాండూరు కూడలి వద్ద ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి నక్కా శోభన్ యాదవ్ పార్టీ శ్రేణులతో కలసి 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో జరుగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి హరి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి కొమిరి మాధవయ్య, నాయకులు రాధాకృష్ణ, శ్యామ్, ప్రణీత్, మునీంద్ర పాల్గొన్నారు.

పోలూరు జగన్నాథంకు తెలుగుతేజం అవార్డు



పోలూరు జగన్నాథం

వరదయ్యపాళెం: మండలానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారుడు పోలూరు జగన్నాథం అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'తెలుగు తేజం' భాషా సేవా పురస్కారానికి ఎంపిక య్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నుంచి ఆహ్వానం అందుకున్నారు. ఆగస్టు 31న పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించే తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. జగన్నాథం రాసిన పలు కవితలు, వివిధ దినపత్రికల్లో ప్రచురణకు నోచుకున్న నేపథ్యంలో ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. అలాగే అనేక వేదికల మీద తన కవితలు, పాటలతో ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ పురస్కారానికి ఎంపిక చేసిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కు ఎంపిక కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ సిపాయి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామంలో శనివారం గ్రామ పెద్ద రెడ్డివారి సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గ్రామానికి చేరుకున్నారు. సుబ్బారెడ్డి భౌతికదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు వడ్ల తంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, రెడ్డివారి మోహన్ రెడ్డి, పాత గుంట గురవారెడ్డి, మునస్వామిరెడ్డి, రవి, యువ నేస్తం అధ్యక్షులు మునిశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నేలమట్టం





రెవెన్యూ అధికారులు తొలగించిన అక్రమ కట్టడం, డ్రైవర్ల కాలనీలో ఇంటిని తొలగిస్తున్న జేసీబీ

రేణిగుంట: మండలంలోని కొత్తపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 3లో వున్న వాగు పొరంబోకు స్థలంలో టీడీపీ నాయకుడు నిర్మించిన రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఎవరు నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్న స్థానికులు

విమానాశ్రయానికి వెళ్లే రోడ్డులో 30 ఏళ్ల క్రితం 60 మంది లారీ డ్రైవర్లకు స్థలాలు ఇచ్చారు. వాటిలో ఇళ్లు నిర్మించుకుని నివాసం కూడా వుంటున్నారు. ఈ క్రమంలో ఆ కాలనీలో శనివారం అక్రమ కట్టడాలు అంటూ నాలుగు రేకుల ఇళ్లను రెవెన్యూ అధికారులు తొలగించారు. అధికారులను స్థానికులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. 30 ఏళ్లుగా తాము ఇక్కడ వుంటున్నామని, ఇప్పుడు అధికారులు అక్రమ కట్టడాలని పేర్కొంటూ తొలగించడానికి ప్రయత్నించడం దారుణమని తెలిపారు.

రేపు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం నుంచి ఏర్పేడు మండలంలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎం.భార్గవి తెలిపారు. ఇటీవల నూతనంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామాల్లోని వారి ఇంటి వద్దే అందజేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి రేషన్ కార్డులు తీసుకోవాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులు

శ్రీకాళహస్తి: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకాళహస్తిలో ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. తద్వారా జ్వరాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ప్రజలు కాలువలో చెత్తను వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ భవానీ ప్రసాద్, నాయకులు కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు



కాలువలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం సమీపంలోని చెంబేడు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం తొలగించారు. కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలలేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాదును ఆదేశించారు. ఈ క్రమంలో శనివారం హిటాచీలతో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. పనులను కమిషనర్ భవానీప్రసాద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ పర్యవేక్షించారు.

రేపు టోకెన్ల పంపిణీ



మాట్లాడుతున్న సురేంద్రకుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఉచిత వినాయక విగ్రహాలకు సంబంధించి టోకెన్లను సోమవారం పంపిణీ చేయనున్నట్లు వినాయక చారిటబుల్ ట్రస్టు అధినేత, టూరిజం మాజీ డైరెక్టర్ సురేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తితోపాటు గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేసుకునే యువతకు 29 ఏళ్లుగా విగ్రహాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా 25న టోకెన్లు ఇస్తామని, తర్వాత విగ్రహాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోతులరాజ్‌కుమార్, ఆనందరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని హెచ్‌ఎం వాణి తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్రలో భాగంగా పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, పచ్చదనం పెంపు కోసం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవడం వల్లే వర్షాలు పడడం లేదని, ఎండవేడిమి ఎక్కువ ఉందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచాలని కోరారు. చెట్లను పెంచడం వల్ల పచ్చదనం వస్తుందని, దీంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, సురేష్‌బాబు, నాదెండ్లమురళి, దాసు, జగన్నాథం, మాధవీలత, సుజన, తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభి గిరిజన కాలనీ, గ్రామాలకు కేటీరోడ్డు నుంచి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయని, క్రషర్లు, క్వారీల నుంచి లారీల్లో 50 టన్నులకు పైగా బరువున్న రాళ్ల మెటల్ నింపుకుని తీసుకుపోతున్నారని తెలిపారు. దీంతో రోడ్డు దెబ్బతిందని, ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడంతో అధ్వానంగా తయారైందన్నారు. చినుకు పడితే చిత్తగా మారి, రోడ్డుపై నడవడానికి ఇబ్బంది పడుతున్నామని, ద్విచక్రవాహనాలు, కార్లు నడపటం కష్టమవుతుందని, దీంతో వాహనాలు ప్రమాదాలకు బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై గుంతల వల్ల ఆర్టీసీ బస్సుల కట్టలు దెబ్బతింటున్నాయని, బస్సులను తిప్పడం మానేశారని, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రహదారిలో రోజుకు 200 పైగా లారీలు 50 టన్నుల రాళ్ల మెటల్ ఓవర్‌లోడుతో రోడ్డుపై తిరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మచ్చలేని నాయకుడు నారాయణస్వామి



జిల్లా అధికార ప్రతినిధి చిన్నా

వరదయ్యపాళెం: సుదీర్ఘ రాజకీయాల్లో ప్రజాసేవ తప్ప అవినీతి మచ్చలేని నాయకుడు మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా అన్నారు. శనివారం సాయంత్రం ఆయన వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యాపారాలు, ఇతర వ్యాపకాలు లేని నారాయణస్వామిపై మద్యం కుంభకోణం మోపడం కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగ వేధింపులకు పరాకాష్ట అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సత్యవేడు నియోజకవర్గం 2004కి ముందు ఎంతో వెనుకబడిన ప్రాంతమని, అలాంటి ప్రాంతం నేడు పారిశ్రామికపరంగా ఇంత అభివృద్ధి చెందిందంటే ఆయన హయాంలో ఏర్పాటైన శ్రీసిటీ లాంటి మహావృక్షమే అన్నారు. ఉపముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. దళిత వర్గానికి చెందిన ఆయన ఉపముఖ్యమంత్రి స్థాయి వరకు ఎదగడం ఓర్వలేని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అవినీతి మరకలు అంటించేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా రాజకీయాల్లో రాణించిన నారాయణస్వామిపై నిరాధారణ లేని ఆరోపణలతో ప్రజాభిమానానికి దూరం చేయలేరని, ఇలాంటి కుట్రలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి సమాజానికి సేవ చేయండి



మాట్లాడుతున్న అజారుద్దీన్

శ్రీకాళహస్తి: విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి సమాజ సేవ చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ టి.రమేష్ బాబు తెలిపారు. ఆయన శనివారం ఆర్బీబీఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఇప్పటి వరకు 32 మంది తృతీయ సోపాన్, 12 మంది రాజ్య పురస్కార్ అవార్డులు పొందినట్లు తెలిపారు. హెచ్‌ఎం వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని అలవరుచుకోవాలని కోరారు. స్కౌట్స్ మాస్టర్ ఎస్‌కే అజారుద్దీన్, కె.మహేంద్ర, ఉపాధ్యాయులు మణి విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల కలిగే ఉపయోగాలని వివరించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేందుకు ముందుకు వచ్చారు.

ఓటర్ల సంఖ్య 1200 దాటితే కొత్త పోలింగ్ కేంద్రం



మాట్లాడుతున్న ఎన్నికల డీటీ వెంకటేశ్వర్లు

సత్యవేడు: నియోజకవర్గంలో ఏ పంచాయతీలో అయినా 1200 వందలు దాటితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దారు టి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో కొత్త ఓటర్లు నమోదు, జాబితాలో పేర్లు చేర్పులు, తొలగింపులపై చర్చించారు. పోలింగ్ ఏజెంట్ల జాబితాను బీఎల్‌ఓలకు అందజేయాలని పార్టీ నాయకులను కోరారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అల్లపుగుంటలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. చెంగంబాకంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీధర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు, ఎన్నికల విభాగం అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం



రైతులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని వేంబాక్కం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పేయ దూడల ప్రదర్శనలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పాడి రైతులంతా తమ పేయదూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేయదూడల ప్రదర్శన వల్ల మేలు జాతి దూడలపై పాడి రైతులకు అవగాహన కల్పించి, వాటిని పెంచడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచవచ్చన్నారు. తద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం పేయదూడలను ప్రదర్శించిన రైతులకు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య శాఖ ఏడీ డాక్టర్ సయ్యద్, పశు వైద్య డాక్టర్లు ఏవి ప్రదీప్, ఎన్ఏ కుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు మురళి, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఆయన శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా డీజే సౌండ్స్ పెట్టొద్దన్నారు. రికార్డింగ్ డ్యాన్స్ నిర్వహించరాదని, బలవంతపు వసూళ్లు చేపట్టరాదని తెలిపారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

శ్రీకాళహస్తి: వినాయక చవితి పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజున రాజకీయ ప్రేరేపిత ప్రసంగాలు చేయకూడదన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు. 5 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలు ఉన్నా, మండపంలో విలువైన వస్తువుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపునకు అనుమతులు ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. నిబంధనలను పాటించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.